సాక్షి ప్రకాశం

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



రెచ్చిపోతున్న మట్టి మాఫియా!
సింగరాయకొండ ఊరచెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగు రోజులుగా జేసీబీలు, టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. - 8లో..



నకిలీ ఉత్తర్వులతో టోకరా
ఉద్యోగం ఇప్పిస్తానంటూ నకిలీ ఉత్తర్వులు చూపించి ఒంగోలుకు చెందిన వ్యక్తి తన వద్ద రూ.2 లక్షలు వసూలు చేశాడని బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేసింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొండపి పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్

కొండపి: కొండపి పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం సర్పంచ్‌తో పాటు, అన్ని వార్డుల్లో పార్టీ సానుభూతిపరులు పోటీ చేస్తారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీమంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలపై ఆయన సమీక్షించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పోటీ విషయమై కూటమి ప్రభుత్వ నాయకులు రాజీకి వచ్చారని 14 వార్డుల్లో 9 టీడీపీకి, 5 వైఎస్సార్‌సీపీ కి కేటాయిస్తామని, సర్పంచ్ అభ్యర్థి టీడీపీకి కేటాయించాలని ప్రతిపాదించారని, కానీ ఈ ఒప్పందానికి తాను ఒప్పుకోలేదని విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానన్నారు. అధిష్టానం సూచనలతో సర్పంచ్‌తో పాటు అన్ని వార్డులకు అభ్యర్థులు బరిలో ఉంటారని ఆయన వివరించారు. పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పది రోజులుగా పోస్టింగ్ కోసం ఎదురుచూపులు



ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కార్యాలయం ముందు కూర్చున్న జేఈ సుభద్రాదేవి

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జేఈ పోస్టింగ్ కోసం పది రోజులుగా ఓ మహిళా అధికారి ఎదురుచూపులు చూస్తోంది. తర్లుపాడు మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జేఈగా పనిచేస్తున్న సుభద్రాదేవి బేస్తవారిపేట మండల జేఈగా చేరేందుకు ఎమ్మెల్యే లెటర్ తీసుకున్నారు. ఈ మేరకు గతనెల 25వ తేదీ డ్వామా పీడీ బేస్తవారిపేట మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈగా అపాయిన్‌మెంట్ లెటర్ ఇచ్చారు. అదేరోజు ఎంపీడీఓ కార్యాలయంలో జాయినింగ్ లెటర్ అందజేశారు. రాచర్ల మండలం జేఈగా పనిచేస్తున్న నాగేశ్వరరావు బేస్తవారిపేటలో ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. ఇతను రిలీవ్ కాకపోవడంతో సుభద్రాదేవి పది రోజుల నుంచి కార్యాలయానికి రావడం, కనీసం సంతకాలు కూడా చేయకుండా వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే లెటర్ ఇచ్చినా నాగేశ్వరరావును బేస్తవారిపేటలో ఉంచాలని, సుభద్రాదేవిని చేర్చుకోవద్దని టీడీపీ నాయకులు ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

12న జాతీయ నులిపురుగుల దినోత్సవం

ఒంగోలు సబర్బన్: నులిపురుగులు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు హాని కలిగిస్తాయని జేసీ ఆర్.గోపాల కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని మీ కోసం కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవంపై కన్వెర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జాతీయ నులిపురుగులు దినోత్సవ పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. జిల్లాలో 1-19 ఏళ్లలోపు పిల్లలు 5,96,751 మంది ఉన్నారని వారికి 6,08,000 ఆల్బెండజోల్ మాత్రలు అవసరం అవుతాయన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు నులిపురుగుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథి మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు, ఇతర విద్యా సంస్థలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ సూరిబాబు, డాక్టర్ కమలశ్రీ,, ఐసీడీఎస్ పీడీ, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి పాఠం.. శిక్షణ భారం!

పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తున్నా, తరగతుల్లో పాఠాలు చెప్పడానికన్నా..యోగాంధ్ర ప్రాక్టీస్, మెగా పీటీఎం, లీడర్షిప్ శిక్షణ ఇవే ఎక్కువ జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఉపాధ్యాయులు తరగతి గదుల కంటే బడిబయటే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. సరైన ప్రణాళికలు లేకుండా అమలు చేస్తున్న కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో అపనమ్మకం పెరుగుతోంది.

- విద్యా సంవత్సరం ఆరంభం నుంచే బోధనేతర పనుల్లో టీచర్లు బిజీ
- యోగా, మెగా పీటీఎంల పేరుతో స్కూళ్లకు దూరం
- నేడు శిక్షణలతో నాలుగు రోజుల పాటు పాఠాలు గోవిందా
- 366 మంది ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు, ఎఫ్ఎల్ఎన్ పై ట్రైనింగ్
- ఇప్పటికే పలు రకాల యాప్‌లతో ఉపాధ్యాయుల అవస్థలు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలి

ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధ్యాయులకు యోగాంధ్ర, మెగా పీటీఎం, విద్యార్థులకు ప్లాంటేషన్, ఎస్ఎల్‌డీపీ ట్రైనింగ్ తదితర బోధనేతర పనులతో అడ్మిషన్ల ప్రక్రియకు అంతరాయం కలిగింది. రకరకాల వివరాల కోసం "మోస్ట్ అర్జెంట్.. గంటలో కావాలి.. సాయంత్రం లోపు కావాలి" అంటూ మండల విద్యాశాఖాధికారులు, సీఆర్పీలు, హెడ్మాస్టర్లను ఉపాధ్యాయులను ఫోన్ చేసి వేధిస్తున్నారు. ఉపాధ్యాయుల మీద యాప్‌ల భారాన్ని, బోధనేతర పనులను తగ్గించి వెంటనే పొజిషన్ ఐడీలు రాని ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి. – షేక్ అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



హమ్మయ్య అనుకునే లోపే..

వరుస కార్యక్రమాలతో బిజీగా గడిపిన ఉపాధ్యాయులు ఇక విద్యార్థులకు పాఠాలు చెప్పే పనిలో నిమగ్నమవుదామని అనుకునేలోపే లీడర్షిప్, ఎఫ్ఎల్ఎన్ వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 3వ స్పెల్ కింద పాదిలిలోని జోసఫ్ శ్రీహర్ష అండ్ మేరీ ఇంద్రజ కళాశాలలో నేటి నుంచి 366 మంది ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. తప్పనిసరిగా హాజరు కావాలనే హుకుంను జారీ చేస్తున్నారు. ఇలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తరగతి గదులకు దూరం కావడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. తరగతులు సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీచర్లకు బోధనేతర పనులు అప్పగించమంటూ విద్యాశాఖ సర్క్యులర్లు జారీ చేస్తోంది. వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపించడంలేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాప్‌తో సతమతం...

నూతనంగా ప్రారంభించిన 'లీప్' యాప్ ద్వారా పలు సేవలను సమీకరించినా, టెక్నికల్ సమస్యలు ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నాయి. పాఠశాల విద్యాశాఖలో ఉన్న యాప్‌లన్నింటినీ కలిపి లీప్ (లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్ ను రూపొందించింది. ఈ యాప్‌లోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పీటీఎం తదితర అంశాలను అనుసంధానం చేసింది. ఫలితంగా ఫొటో హాజరు, డేటా ఎంట్రీల కోసం ఒక్కోసారి 15-20 నిమిషాలు సమయం వృథా అవుతోందని వారు వాపోతున్నారు.

	స్కూల్స్	విద్యార్థులు
బేసిక్ ప్రైమరీ స్కూల్స్	1488	34,601
మోడల్ ప్రైమరీ స్కూల్స్	713	54,779
ఫౌండేషన్ స్కూల్స్	351	4317
యూపీ స్కూల్స్	92	7458
హైస్కూల్స్	387	94,004
హైస్కూల్ ప్లస్	76	5368
మొత్తం	3107	2,00,527

ఒంగోలు సిటీ: పాఠశాలలు ప్రారంభమై రెండో నెలలు పూర్తైనా కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. తరగతుల్లో బోధనకు బదులుగా వారికి విభిన్నమైన బోధనేతర పనులు అప్పగిస్తుండడంతో విద్యార్థుల భవిష్యత్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది. పాఠశాలలు జూన్ 12న ప్రారంభమైనప్పటికీ, ఉపాధ్యాయులు అప్పటి నుంచే బదిలీల కౌన్సెలింగ్‌లు, శిక్షణ కార్యక్రమాలు, వివిధ యాజమాన్య సమావేశాలతో తలమునకలయ్యారు. బోధనేతర పనులతో టీచర్లు బిజీగా ఉండడంతో మా పిల్లల చదువు దెబ్బతింటోందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కూళ్లు తెరుచుకున్నా కొనసాగిన బదిలీల కౌన్సెలింగ్..

జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వ నిర్వాకం, విద్యాశాఖ ముందు చూపు లేకపోవడంతో స్కూళ్ల తలుపులు తెరుచుకున్నా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరుగుతూ వచ్చింది. కౌన్సెలింగ్ నిబంధనల ప్రకారం జగరడంలేదని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసిన సంగతి విదితమే. బదిలీల తంతు ముగిసింది. బదిలీ అయిన వారు విధుల్లో చేరారు. అప్పటికే వారం పాటు విద్యార్థులకు పాఠాలు దూరమయ్యాయి.

ప్రభుత్వ ప్రచార యావ..
గురువులకు, విద్యార్థులకు శాపం..

జూన్ 21న కూటమి ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శాపంగా మారింది. గిన్నిస్ రికార్డు కోసం కూటమి ప్రభుత్వం నానా హంగామా చేయడంతో ఉపాధ్యాయులు పడరాని పాట్లుపడ్డారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలంటూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. ఫలితంగా విద్యార్థుల చదువులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జూలై 10వ తేదీ ఆర్భాటంగా నిర్వహించిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాల(మెగా పీటీఎం)కు పదిహేను రోజుల ముందు నుంచే టీచర్లు తగరతి గదులకు దూరమయ్యారు.

ఫ్యాప్టో నేతల ధర్నా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, శిక్షణలతో మానసిక ఒత్తిడిలకు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బలవంతపు పీ 4 కార్యక్రమంతో ఉపాధ్యాయులను నిర్బంధానికి గురి చేయరాదన్నారు. బదిలీల ప్రమోషన్లు తీసుకున్నా పొజిషన్ ఐడీలు రాని ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ సమస్య పరిష్కరించాలని, అంతర జిల్లాల బదిలీలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబరు 57 ను అమలు చేయాలని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులు కష్టాలపాలు

- రైతులను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- యూరియా సహా ఎరువుల కొరత తీర్చాలి
- ఎరువుల పంపిణీ, గిట్టుబాటు ధరల్లో ప్రభుత్వం విఫలం
- రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- జేసీ గోపాల కృష్ణను కలిసి వినతిపత్రం అందజేత



జేసీ గోపాలకృష్ణను కలిసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్ తదితరులు

ఒంగోలు సబర్బన్: టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను మరిన్ని కష్టాలపాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు చుండూరు రవిబాబు, దద్దాల నారాయణలతో పాటు మరికొంత మంది నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బ్రహ్మానంద రెడ్డి రైతులకు పెట్టుబడి సహాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, జూన్, 2024 నుంచే దీన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందని మండిపడ్డారు. ఈ రెండు సంవత్సరాలకు గాను ప్రతి రైతుకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. అంతే కాక 7 లక్షల మందికి ఈ పథకంలో కోత విధించారన్నారు. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు అధిక వడ్డీలతో ప్రైవేటు అప్పుల మీద ఆధార పడే పరిస్థితిని సృష్టించారన్నారు. ఏ రైతుకూ గిట్టుబాటు ధర దొరకడంలేదన్నారు. రైతు తాను పండించిన పంటలను రోడ్డుమీద వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత పంటల బీమా రద్దు చేశారని, గత ఏడాది ఇన్సూరెన్సు చెల్లించకపోవడంతో రైతులకు బీమా డబ్బులు రాని పరిస్థితి ఏర్పడిందని, రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా ఎత్తివేశారని మండిపడ్డారు. రైతుకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ అండగా ఉన్న ఆర్బీకేల వ్యవస్థను పూర్తిగా నీరుగార్చారన్నారు. రైతులకు ఎరువులను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. యూరియా దొరక్కపోవడంతో ఎక్కడకు వెళ్లాలో రైతులకు అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. యూరియా కేటాయింపులకు, సరఫరాకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. పొటాష్ కలిసిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా బస్తాపై బ్లాక్ మార్కెట్లో రూ.60 నుంచి రూ.100 వరకు అదనంగా డిమాండ్ చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవి బాబు మాట్లాడుతూ రైతాంగం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, అధిక రేట్లు పెట్టి ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎరువులు కొంటున్నారని అన్నారు. రైతులు ఓవైపు కష్టాలు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం సమీక్షలు చేసే పరిస్థితి కూడా కనిపించడంలేదని మండిపడ్డారు. రైతులకు వెంటనే ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారి లైసెన్సులు రద్దు చేయాలని వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు వేలం కేంద్రాల నుంచి ఒక్కో రైతు 40 నుంచి 50 శాతం బేళ్లు వెనక్కి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. పొగాకు కిలో రూ.200 తగ్గకుండా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ, పార్టీ జోనల్ రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మారెళ్ల బంగారు బాబు, మాజీ ఎమ్మెల్యే కుసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరాల రమణా రెడ్డి, పార్టీ నాయకులు కాట్రగడ్డ మహేష్ బాబు, పోలవరం శ్రీమన్నారాయణ, మన్నే శ్రీనివాస రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైద్యశాలలో రాజకీయాలొద్దు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- హాస్పిటల్ అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడదాం
- అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ప్రభుత్వ వైద్యశాలలో రాజకీయాలకు తావివ్వవద్దని, హాస్పిటల్ అభివృద్ధికి తామందరం కలిసికట్టుగా పాటుపడదామని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. వివిధ రోగాలతో వైద్యశాలకు వచ్చిన పేదలను రక్త పరీక్షల కోసం బయటికి పంపుతున్నారని, ఇంజక్షన్‌లు, మందులు రాసిచ్చి మెడికల్ షాపుల వద్దకు పంపడం సరైంది కాదని, దీనివలన రోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ అందుబాటులో ఉండకపోవడం, వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో రోడ్డు ప్రమాద బాధితులు అనేక మంది మృతి చెందారని, అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని డీఆర్సీ, జెడ్పీ సమావేశాలలో అనేక పర్యాయాలు అడిగినా ఫలితం లేకుండా పోయిందని ఆయన అన్నారు. వైద్యశాలలో ఏర్పాటు చేస్తున్న భోజన కాంట్రాక్టర్ స్థానికంగా ఉండేలా చూడాలని, రోగులకు రెండు పూటలా మంచి భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యశాలలో పూర్తి స్థాయిలో వైద్యులున్నా తగిన సదుపాయాలు, ల్యాబ్‌లు లేకపోవడంతో రోగులు ఈ హాస్పిటల్‌ను గుర్తించడం లేదని, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి రోగులు ప్రాణాలు పోగొట్టుకోవడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులుగా మందుల ఆదిశేషు, పాత్లావత్ బాలు నాయక్‌లను ఎమ్మెల్యే ప్రకటించారు. సభ్యులుగా నియమితులైన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి వైద్యశాలలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఆర్థోపెడిక్ విభాగంలో సి-యాం మిషన్, ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయడంతోపాటు మరో 10 తీర్మానాలు చేసి కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం వైద్యశాలకు మంజూరైన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పూర్తి సదుపాయాలు కలిగిన మరొక అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నారని, వైద్యశాల మార్చురీలో ఫ్రీజర్ బాక్స్, మృతులను తమ నివాసాలకు చేర్చేందుకు వాహనాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యదిద్యా, డాక్టర్ ముబినా, డాక్టర్ రాంజీ నాయక్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, పార్టీ జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా భూములు ఆన్‌లైన్ చేసుకున్నారు

- తోకపల్లి మాజీ సర్పంచ్ గ్రామంలోని పొలాలు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడు
- కనిగిరి మండలం వంగపాడులో పశువుల బీడు 100 ఎకరాలు కబ్జా
- మీ కోసంలో జేసీ గోపాలకృష్ణకు ఫిర్యాదు



భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని జేసీకి ఫిర్యాదు చేస్తున్న తోకపల్లి గ్రామస్తులు

ఒంగోలు సబర్బన్: పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుల భూములను మాజీ సర్పంచ్ భర్త మేకల శంకరరావు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని తోకపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమాన్ని జేసీ రోణంకి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన తోకపల్లి గ్రామస్తులు జేసీని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామంలోని అనేక సర్వే నంబర్లలోని భూములను మేకల శంకరరావు అధికారులను లోబరుచుకొని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడన్నారు. శంకరరావు పేరుమీద 50కి పైగా భూముల ఆన్‌లైన్ ఖాతా నంబర్లు ఉన్నాయని జేసీకి వివరించారు. అతని వద్ద నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు, నకిలీ రిజిస్టర్ డాక్యుమెంట్లు సృష్టించి గ్రామంలోని ఇతరుల భూములను ఆన్‌లైన్ చేయించుకున్నాడని వివరించారు. అతని ఇంట్లో రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు, సర్వే అధికారుల స్టాంపులు, లెటర్ ప్యాడ్‌లు అనేకం ఉన్నాయన్నారు. అదేమని అడిగితే చంపుతానంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు. గ్రామానికి చెందిన బిట్రా తిరుమలమ్మ (85)కు చెందిన 4 ఎకరాల భూమిని కూడా అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని, ఆమె ఆరు నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేదని జేసీ దృష్టికి తెచ్చారు.

వంద ఎకరాల పశువుల బీడు కబ్జా..

కనిగిరి మండలం వంగపాడు గ్రామంలోని వంద ఎకరాల పశువుల బీడు కబ్జాకు గురైందని గ్రామానికి చెందిన కాకర్ల శ్రీనివాసులు జేసీకి ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కాకర్ల సత్యం, కాకర్ల కొండయ్య, కాకర్ల సూర్యంతో పాటు మరికొంతమంది కలిసి పశువుల బీడు భూమిని అన్యాక్రాంతం చేశారన్నారు. దాదాపు 15 సర్వే నంబర్లలోని ఈ భూమి కొంతమంది చేతుల్లోకి వెళ్లటంతో గ్రామంలోని మిగతా రైతులు, పశు పోషకులకు చెందిన పశువులను పొలాల్లోకి వాళ్లు రానీయటం లేదన్నారు. రెవెన్యూ అధికారులు కూడా వాళ్లతో కలిసిపోయారని వివరించారు. కనీసం ఆర్‌టీఐ కింద సమాచారం అడిగినా రెవెన్యూ అధికారులు ఇవ్వటం లేదన్నారు.

1996 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి..

1996 డీఎస్సీలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని అప్పటి డీఎస్సీ అభ్యర్థులు పలువురు మీకోసం కార్యక్రమంలో సింగరాయకొండకు చెందిన రావూరి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో అర్జీ సమర్పించారు. 1996 డీఎస్సీలో క్వాలిఫై అయ్యానని, మూడు విడతలుగా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారన్నారు. ఎంపికైనా సెలక్షన్ జాబితాలో తన పేరు లేదన్నారు. కొందరు కోర్టుకు వెళ్లారని, తాను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి కోర్టుకు వెళ్లలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 1998 అభ్యర్థులకు మాత్రం ఎంటీఎస్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఎంటీఎస్ మాదిరిగా 1996 అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని వేడుకున్నారు.

క్లుప్తంగా

నేడు ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలో ఉన్న ఎస్‌యూవీఆర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ డీసీసీపీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా మంగళవారం భర్తీ చేయనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వి.ఏసుప్రసాద్ రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. పాలిసెట్ - 2025 ఎంట్రెన్స్ రాసి అర్హులై కౌన్సిలింగ్‌కు హాజరుకాని వారు, ఎంట్రెన్స్‌లో క్వాలిఫై కానివారు, దరఖాస్తు చేసి పరీక్ష రాయని వారితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వారి సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు అయిన వెంటనే ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు తన మొబైల్ నంబర్ 9441885492ను సంప్రదించాలని కోరారు.

రేపు జూనియర్ టార్గెట్ బాల్ ఎంపిక పోటీలు

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ టార్గెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ మునీర్ తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు 2008 జనవరి ఒకటో తేదీకి ముందు జన్మించిన వారు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9701523167ను సంప్రదించాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య


మాట్లాడుతున్న పిచ్చయ్య

మార్కాపురం: గ్రంథాలయాల్లో పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికపై భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ గ్రంథాలయాల్లో 974 పోస్టులు, స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1800 పోస్టులు, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో 300 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కాకుండా రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి లైబ్రేరియన్ కోర్సు చేసిన వారికి వయసు పెరిగిపోతోందని, ఈ విషయమై విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసినా ఫలితం లేదన్నారు. గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం గ్రంథాలయ శాఖ ఖాళీ పోస్టుల సాధన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా సీహెచ్ మణికంఠ, ఎం.చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్యాంబాబు, బాదరయ్య, శివ, సభ్యులుగా గురవయ్య, తేజ, మల్లికార్జున తదితరులను ఎన్నుకున్నట్లు డివిజన్ అధ్యక్షుడు షేక్ జబ్బార్ తెలిపారు.

11 నుంచి ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: సీసీ కెమెరా, సెక్యూరిటీ అలారం ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఈ నెల 11 నుంచి 23వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ పొందగోరే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8309915577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

- సింగరాయకొండ ఊరచెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- నాలుగు రోజులుగా జేసీబీలు, టిప్పర్లతో మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


ఊరచెరువు నుంచి రాత్రి వేళ మట్టి తరలిస్తున్న టిప్పర్లు

సింగరాయకొండ: అధికారాన్ని అడ్డు పెట్టుకుని కూటమి నాయకులు సాగిస్తున్న దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారులకు తాయిలాలు ముట్టజెప్పి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ ఊరచెరువులో గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నేత కనుసన్నల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో జేసీబీలు, టిప్పర్లు వినియోగించి మట్టి అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. టిప్పర్ మట్టిని రూ.4 వేల చొప్పున, ట్రాక్టర్ ట్రిప్పు మట్టిని రూ.800 చొప్పున విక్రయిస్తూ టీడీపీ నేత రూ.లక్షల్లో ఆర్జిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

సాగు ప్రశ్నార్థకం

ఊరచెరువులో జేసీబీలతో భారీగా గోతులు తవ్వి మట్టి తరలిస్తున్నా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రాత్రి వేళ అడ్డగోలుగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను నియంత్రించేందుకు పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులో అక్రమ తవ్వకాల కారణంగా భారీ పరిమాణంలో ఏర్పడిన గుంతల వల్ల ఆకయట్టు సాగు ప్రశ్నార్థకమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తూముల ద్వారా పొలాలకు నీరు చేరే అవకాశం ఉండదన్నది రైతుల ఆందోళనకు ప్రధాన కారణం. మరికొద్ది రోజులు మట్టి తవ్వకాలు ఇలాగే కొనసాగితే ఆకయట్టు భూములకు చుక్క నీరు కూడా చేరే అవకాశం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



పాతసింగరాయకొండలోని ఊరచెరువులో అక్రమంగా మట్టి తవ్విన ప్రదేశం

దర్శి యువకుడు బెంగళూరులో మృతి

- రోడ్డు ప్రమాదంలో దుర్మరణం
- నాలుగేళ్లుగా లండన్‌లో ఉండి ఇటీవలే బెంగళూరు వచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం


ఖగోల్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

దర్శి: దర్శికి చెందిన మార్తుల ఖగోల్‌రెడ్డి (31) బెంగళూరులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విశ్రాంత ఎస్సై మార్తుల వెంకటేశ్వరరెడ్డి కుమారుడైన ఖగోల్‌రెడ్డి గత నాలుగేళ్లుగా లండన్‌లో ఉండి మాస్టర్ ఎంబీఏ పూర్తి చేశారు. గత మార్చిలో ఇండియా వచ్చి బెంగళూరులోని డేటా సెంటర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహితుడితో కలిసి బెంగళూరు వస్కోట్‌లో ఉదయం 4 గంటల సమయంలో 4 ఏఎం బిర్యానీ పాయింట్‌కి మోటార్ సైకిల్‌పై వెళ్లారు. ఆ హోటల్ తీయకపోవడంతో తిరిగి వస్తుండగా, లలియ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే ఫ్లైఓవర్‌పై స్నేహితుడి హెల్మెట్ కిందపడింది. మోటార్ సైకిల్ వెనుకవైపు కూర్చుని ఉన్న ఖగోల్‌రెడ్డి కిందకు దిగి హెల్మెట్ తీసుకొస్తున్న సమయంలో హైవేపై వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో హైవేపైనుంచి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే ఖగోల్‌రెడ్డి మృతిచెందాడు. సోమవారం బెంగళూరులోని ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మంగళవారం దర్శిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. విశ్రాంత ఎస్సై వెంకటేశ్వరరెడ్డికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా కుమార్తెలకు వివాహం జరిగింది. ఏకైక కుమారునికి పెళ్లి చేయాలని కలలు కంటున్న సమయంలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. పుచ్చల మిట్టలోని వారి నివాసం వద్ద విషదం అలముకుంది.

నకిలీ ఉత్తర్వులతో రూ.2 లక్షలకు టోకరా

- ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేసిన మహిళ

ఒంగోలు టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానంటూ నకిలీ ఉత్తర్వులు చూపించి ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి తన వద్ద 2 లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేశాడని కందుకూరు టౌన్‌కు చెందిన ఓ మహిళ సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆమె ఎస్పీని కలిసి తన సమస్యను విన్నవించుకున్నారు. అదే విధంగా ఏటీఎం వద్ద మోసానికి గురయ్యానని ఒంగోలు నగరంలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత అవసరాల కోసం ఏటీఎంలో 50 వేల రూపాయల డబ్బు బదిలీ చేసేందుకు వెళ్లగా, ఏటీఎం పనిచేయకపోవడంతో ఏం చేయాలో తోచక నిలుచున్నానని, ఆ సమయంలో ఒక వ్యక్తి వచ్చి నెఫ్ట్ ద్వారా డబ్బులు పంపిస్తానని నమ్మబలికాడని తెలిపారు. అతడి చేతికి 50 వేలు ఇచ్చానని, డబ్బులు అకౌంటులో పడకపోవడంతో మోసం జరిగినట్లు గ్రహించానని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నాడు. బాధితుల ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ.. వెంటనే ఆయా పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ, ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, మీ కోసం ఎస్సై జనార్దన్ పాల్గొన్నారు.


బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

నిమ్మతోటలను పరిశీలించిన ఉద్యానవన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురంలో నిమ్మ తోటలను ఉద్యానవనశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. నిమ్మ ధరలు భారీగా పడిపోవడంతో పాటు తోటలకు తెగుళ్ల ఆశించాయని రైతులు ఆందోళన చెందుతుండటంపై సాక్షి దినపత్రికలో 'పాతాళంలోకి నిమ్మ ధరలు' శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన హార్టీకల్చర్ అధికారులు సీతారాంపురంలోని నిమ్మ తోటలను పరిశీలించి ఎండుపుల్ల, పులుసు పురుగు సమస్య ఎక్కువగా ఉందని గుర్తించారు. తెల్లపులుసు పురుగు, రసం పీల్చే పురుగు, కొమ్మ ఎండు తెగులు ఎక్కువగా ఉందని, వేరుకుళ్లు తెగులు కూడా ఉందని ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ తెలిపారు. తెగుళ్ల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, పిచికారీ చేయాల్సిన క్రిమిసంహారక మందులపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఎండుపుల్లలు వచ్చిన వెంటనే కత్తిరించాలని తెలిపారు. నిమ్మతోటకు డ్రిప్ ద్వారా నీటిని అందించాలన్నారు. వేసవిలో నిమ్మ పండ్లు కోతకు వచ్చేలా బహార్ పద్ధతి పాటించడం వలన కాయకు మంచి గిరాకీ వస్తుందన్నారు. రైతు ఆదాయం పొందుతారన్నారు. ఆమె వెంట వీఏఏ భరత్, రైతులు ఉన్నారు.


నిమ్మతోటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ

నేడు 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ఒంగోలు సిటీ: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఒంగోలులోని రామ్‌నగర్ 5వ లైన్‌లో గల ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ కార్యాలయంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల రూపాయల బకాయిలు, 12వ పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్స్ బకాయిలు తదితర ప్రధాన డిమాండ్లపై చర్చించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఒక వీడియో రూపంలో ముందుకు రానున్నట్లు తెలిపారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు

మద్దిపాడు: పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆత్మ సౌజన్యంతో మండలంలోని నాగన్నపాలెం గ్రామంలో సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం బర్లీ పొగాకు వలన రైతులు నష్టపోయారని, రాబోయే సంవత్సరం పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు వేసుకోవాలని ఆయన సూచించారు. డీపీఎం సుభాషిని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎరువులు, పురుగు మందులు వేయకుండా పంట దిగుబడులు పెంచుకోవాలన్నారు. రైతులంతా ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని కోరారు. ఆత్మ డీపీడీ విజయనిర్మల మాట్లాడుతూ మట్టి పరీక్ష కార్డుల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ రైతులంతా పంట వేయనటువంటి నేలను కూడా నమోదు చేయించుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాల డబ్బులు జమ కాని రైతులు గ్రీవెన్స్ పెట్టుకోవచ్చని తెలిపారు. డీఏవో ఎస్.శ్రీనివాసరావు మినుము వేసే రైతులకు మినుము కిట్లు అందించారు. సర్పంచ్, రైతులకు నవధాన్యాల కిట్లు అందించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పండుగలా జరపాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌ఓ, ఇతర జిల్లా అధికారులు

- ప్రత్యేక కార్యక్రమాల ఏర్పాట్లపై దృష్టి సారించాలి
- జిల్లా అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా వీడియో కాన్ఫరెన్స్

ఒంగోలు సబర్బన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సోమవారం అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 15న 79వ స్వాతంత్య్ర దిన వేడుకలకు అతిథులకు ఆహ్వానం, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం, ప్రభుత్వ పథకాలు తెలియజేసేలా శకటాలు, ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు, ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వీటిని వీక్షించేందుకు విద్యార్థులను తరలించడంపై వంటివాటిపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఉదయం 8:30 గంటలకల్లా విద్యార్థులను పరేడ్ గ్రౌండ్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రోటోకాల్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీ నాటికి ప్రశంస పత్రాల కోసం ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. పీ - 4 పథకంలో మార్గదర్శకులను చురుకుగా గుర్తించిన వారిని, స్వతహాగా మార్గదర్శకులుగా మారిన అధికారులను ప్రశంస పత్రాలకు ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం టౌన్: భార్యపై కోపంతో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన చెన్నమ్మతో దొనకొండ మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన మనుమాల బ్రహ్మయ్య(40)కు వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు సంతానం. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నమ్మ తన పిల్లలను తీసుకుని రాయవరంలోని పుట్టింటికి వచ్చింది. ఆదివారం బ్రహ్మయ్య అత్తగారి ఇంటికి వచ్చి భార్యను తనతో ఇంటికి రమ్మని పిలవగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన బ్రహ్మయ్యను కుటుంబ సభ్యులు హుటాహుటిన మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌బీకేలో ఫ్యాన్ల చోరీ

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట గ్రామ సచివాలయం సమీపంలోని ఆర్‌బీకే భవనం తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు మూడు ఫ్యాన్లు చోరీ చేశారు. ఆదివారం ముఖ్యమంత్రి లైవ్ టెలికాస్ట్ అనంతరం ఆర్‌బీకేకి వీఏఏ తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం శుభ్రం చేయడానికి వచ్చిన పారిశుద్ధ్య కార్మికురాలు తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించి వీఏఏ సాగర్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వెంటనే ఆర్‌బీకేకి వచ్చి పరిశీలించి ఏటుకు తెలియజేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మద్దిపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి


మృతి చెందిన పాపానాయక్

గిద్దలూరు రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట రైల్వే స్టేషన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. దిగువమెట్ట తండాకు చెందిన దేశావత్ పాపానాయక్(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రైల్వే స్టేషన్ వద్ద కాంట్రాక్టర్ నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులకు సోమవారం హాజరయ్యాడు. టిప్పర్ లారీలో ఇనుప సామగ్రిని అన్‌లోడ్ చేసేందుకు డ్రైవర్ ట్రాలీని పైకి లేపిన సమయంలో విద్యుత్ తీగలు తగిలాయి. అది గమనించని పాపానాయక్ టిప్పర్‌లోని సామగ్రి తీసేందుకు ప్రయత్నించడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరాడు. అక్కడే ఉన్న వ్యక్తులు పాపానాయక్‌ను కర్రలతో పక్కకు నెట్టి, చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్కాపురంలో భారీ చోరీ!


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని సత్యనారాయణ స్వామి గుడి సమీపంలోని బాబు కూల్ డ్రింక్స్ దుకాణంలో భారీ చోరీ చోటుచేసుకుంది. వివరాలు.. షాపు యజమాని షేక్ బాబు 4 రోజుల క్రితం మరో ప్రాంతంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి బాబు ఇంటి వద్ద రంపం, ఇతర ఇనుప సామగ్రి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ యు.నాగరాజు, ఎస్సై సైదుబాబుతోపాటు క్లూస్ టీం అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఇంటి యజమాని అందుబాటులో లేరు. సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురై ఉంటాయని బంధువులు చెబుతున్నారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ భవనాలు కబ్జా!


రాచర్ల : సత్యవోలులో టీడీపీ నాయకుడు నివాసం ఉంటున్న స్కూల్ భవనం


కంభం : పశువైద్యశాల భవనంలో ఉన్న టెంట్ హౌస్ సామగ్రి

- సొంతానికి వాడుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు
- పట్టించుకోని అధికారులు

కంభం/రాచర్ల: వినియోగంలో లేని ప్రభుత్వ పాఠశాల గదులు, ప్రభుత్వ భవనాలను ప్రైవేట్ వ్యక్తులు సొంతానికి వినియోగించుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంభం పంచాయతీ పరిధిలోని సాదుమియా వీధిలో పంచాయతీ నిధులతో సుమారు పదేళ్ల క్రితం పశువైద్యశాల నిర్మించారు. నేటికీ ఆ భవనాన్ని పశువైద్యాధికారులు స్వాధీనం చేసుకుని, సేవలందించేందుకు ముందుకు రాకపోవడంతో అది నిరుపయోగంగా ఉంది. ఈ భవనంలో ఓ టెంట్ హౌస్ నిర్వాహకుడు ఇటీవలే పాగా వేశాడు. కొద్ది రోజుల నుంచి టెంట్ హౌస్ సామగ్రిని భద్రపరుకుంటున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు పాఠశాల భవనంలో మకాం వేశాడు. సొంత ఇల్లు నిర్మించుకుంటున్న ఆయన.. స్కూల్ భవనంలో కాపురం పెట్టినా అధికారులు చోద్యం చూస్తున్నారు.